# పన్నాగం

కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి

"సుబ్బూ! సుబ్బూ! అమ్మగార్ని డిగి వో కప్పు కాఫీ పట్రావే!"

"అట్టాగేనయ్యా!" తోముతున్న అంట్లగిన్నె పక్కనబెట్టి, చీర కొంగుతో చేతులుతుడుచుకుంటూ, వంటింటివైపు వడివడిగా నడిచింది సుబ్బులు.

"పొద్దున లేచాక యిప్పటికి రెండు సార్లయింది! యింకా పదిగంటలన్నాకా లేదు. ఈయన చేయబోయేపనికి ఎదురుపు చేయడానికో మనిషి! అంత అర్జంటేమీ లేదు గానీ, అంట్లపని పూర్తిచేయవే సుబ్బులూ! ఆయన అట్టాగే అరుస్తూంటాడులే! పనా! పాటా! రేయింబవళ్లూ పాడుపుస్తకాలు ముందేసుకొని తీరిక లేనట్టు తెగ హైరానాపడుతుంటాడు" వంటింటివైపు వస్తున్న సుబ్బుల్ని ఉద్దేశించి విసురుగానే అంది వసుంధర.

"ఏంటే సుబ్బూ! అమ్మగారేంటో దీవిస్తున్నట్టున్నారు! అన్నీ వినబడుతున్నాయని చెప్పు. అద్భుతమైన కవిత్వం. ఈ 'లైన్స్' విన్నదంటే మీ అమ్మగారు అదిరిపోవాల్సిందే! ఆహా!... ఎంచక్కావున్నాయో వినమను... "మల్లెకన్నను తెల్లని మనసులోన దాచుకొన్న నీ వలపులు దోచుకొందు"

"అనేది వినబడడానికేనని చెప్పవే! ఎప్పుడూ ఈపాడు కవిత్వం పిచ్చేకానీ కాపురం పిచ్చి పట్టకపోయె! 'రిటైర్' అయినోళ్లంతా వోక్షణం తీరిక లేకుండా, దమ్మిడీ ఆదాయం లేకుండా ఇలా పుస్తకాల్లో కూరుకు పోతున్నారటనా?" దెప్పుతోంది వసుంధర.

"పాపం! అయ్యగారు అడిగేది వోకప్పు కాఫే కదమ్మా! వోకప్పు యిస్తే పోలే! ఆయన ఆనందం ఆయనది" ఓ ఉచిత సలహా పారేసింది సుబ్బులు.

"నీదేంపోయిందే! ఉచిత సలహానేకదా! ఎంచక్కగా యిస్తావ్! అతీగతీలేని మగాడితో ఎట్టా ఏగేట్టు! ఉద్యోగం చేసినన్నాళ్లూ 'టైం టూ టైం' అంటూ నా ప్రాణం తోడేసాడు. ఇంట్లో ఇటున్నపుల్ల అటుతీసి పెట్టేటోడుకాదు. ఇంత కాలం ఒంట్లో ఓపికుంది గనుక నెట్టుకొచ్చా! ఇక నావల్లకాదే! ఇప్పుడేమో కవిత్వం, కవిత్వం అంటూ పైత్యం తలకెక్కించుకొని, తలకాయ తింటున్నాడు! సరే!... ఈ కప్పు కాఫీయిచ్చి తొందరగా తెమలమను. కరెంటు బిల్లు, ఫోన్ బిల్లు కట్టిరావాలి, కూరగాయలు తేవాలి! వో!... బోలెడు పనుంది" కష్టాలు ఏకరువుబెడుతూ కాఫీ అందించింది వసుంధర సుబ్బులుకి.

"అట్టాగే అమ్మగారూ! అయ్యగారితో యిట్టే చెప్పేస్తా".

"అయ్యగారు ఏం మంత్రం వేసాడో ఏమో! ఆయన నోట్లోంచి మాట వినబడనీయవు. ఎక్కడ పని అక్కడ వదిలేసి తయారవుతావ్!" వో చురక సుబ్బులుకూ అంటించింది వసుంధర.

"లేదులేండి అమ్మగారు! అయ్యగారు చదివే కవిత్వం విందామని" కాఫీ కప్పుతో రివ్వున పరిగెత్తింది సుబ్బులు.

"అయ్యగారూ! కాఫీ!" నవ్వుతూ గది

గుమ్మంలోనే నిలబడింది సుబ్బులు.

"వచ్చావా! కాఫీ తెచ్చావా! పండు వెన్నెల పెదవిపై పండినట్లు నవ్వుటెందుకో చెప్పవే! నళిన నేత్ర!"

"అయ్యబాబోయ్! నా మీదా కవిత్వమే! నా నవ్వు అంత సొంపుగా వుందా అయ్యగారూ?" వొంకర్లుపోతూ అడిగింది సుబ్బులు.


"బంగరు బొమ్మవో! మారుడు దిద్దిన కీలు బొమ్మవో! నీఅందమంతా ఆనవ్వులోనే వుందే"

"ఏడ్చినట్లుంది మీ కవిత్వమూ, మీరునూ! అదేదో ఊర్వశిననుకొని వంకర్లుపోతోంది! ఆ పుస్తకంలో వుంది అంత పెద్దగా చదువకపోతే ఏమయింది? మీరే ఈ కవిత్వం చెప్పినట్టు తెగ ఫీలైపోతున్నారే!" వంటింట్లోంచి వస్తూ విసుక్కుంది వసుంధర.

"అయ్యగారు మంచి కవి అమ్మగారూ! నాకు కవిత్వమంటే మహా యిది అనుకోండి! నేను 'ఇంటర్'లో స్పెషల్ తెలుగు చదివి అగోరించానులెండి" తనకూ కవిత్వం వినే అర్హత వుందని ఏకరువు పెట్టింది సుబ్బులు.

"ఆ... ఆ... అవును! నీవో మొల్లవు! ఆయనో శ్రీనాధుడు! మరి యింటి పనులు ఎవరు చెయ్యాలో యిక" వెటకారంగా అంది వసుంధర.

"ప్రాణాల తీయు చూపుల బాణములను, నాదు



మెత్తని గుండెలో నాటవద్దు" వక్రమాట లేలనే వసుంధరా దేవి!" అందుమాటలే కాదు క్రీగంటి చూపులూ వున్నాయ్.

"ఇక ఆపవయ్యా మగడా! ఇంటిపని యిప్పటికీ తెమల్లేదు! ఏసంబడమూ లేకపోయినా ఈ సంబడానికి కొదవేలేదు. నీ తోటి 'రిటైర్డ్' అయినోళ్లంతా 'రియల్ ఎస్టేట్ బిజినెస్' చేస్తూ లక్షలు గడిస్తూంటే, నీవు మాత్రం ఈ కవిత్వం పిచ్చితోనే చూపులు... తూపులు... అంటూ ఈ గదిలోంచి బయటకు రాకుండా కాళ్లూపుకుంటూ కూర్చున్నావ్" ఓ క్లాస్ పీకింది వసుంధర.

"పిచ్చియనబోకు ప్రియసఖీ! ప్రేమ మీర, నాదు హృదయమ్ము దోచుకున్నావు చెలియ! కాన్కగా నిత్తు కావ్యమ్ము నొకదాని పదిలముగ దాచుకొమ్ము నీ హృదయమందు".

"అబ్బబ్బ... ఏమి చెప్పారమ్మా అయ్యగారు! నిజంగా కవియంటే అయ్యగారే" చప్పట్లు చరుస్తూ మెచ్చుకొంది సుబ్బులు.

"నీకు పిచ్చెక్కిందేమే! వెధవవాగుడు మాని పనిచూసుకో ఫో! ఆ చదివేదేదో నీలో నీవు చదువుకో మహానుభావా! మమ్మల్నెందుకు పిచ్చోళ్లను చేస్తావ్! నీ కంటే పిచ్చి దీనికెక్కువయ్యేట్టుంది" విసుక్కుంటూ బయటకు నడిచింది వసుంధర.

* * *

"సుబ్బూ! పని అయిందంటే! ఒక్కసారి మీ అమ్మగారిని పిలుచుకొని వస్తావా? మంచి కవిత్వం వినిపిస్తా!"

"ఏంటండీ అంతర్జంటు? వేళకింత తిన్నారు కదా, కొంచెంసేపు పడుకోవచ్చు గదా! పొద్దు లచ్చం ఈ కవిత్వం గోలేనా? ఇంకేమైనా వుందా?"

"రండి అమ్మగారూ! అన్నాలు తినడం అయిపోయింది గదా! కవిత్వం వినిపిస్తారట, విందాం రండి!"

"అన్నం తిన్నాక పక్కవాల్చంది నా శరీరం పనిచేయదే! నీదేం పోయింది, గుండ్రాయిలా గున్నావ్, వయస్సులో వున్నావ్! పిల్లా జెల్లానా? మొగుడొదిలేచినదానవాయే! పనిచేసి వో ముద్దతిని ఈడ పడుండమంటే... నీకు కవిత్వం కావాల్సి వచ్చిందా?"

"కోప్పడకండమ్మా! నేను వెళ్లనులే!"

"ఇద్దరం వెళ్లకపోతే తెగబాధపడిపోతాడు కవిగారు! సరే నీవెళ్లి తగలడు! సాయంత్రం ఆ నొప్పి ఈ నొప్పి కాళ్లొత్తమంటే వూరుకునేది లేదని చెప్పు" సానుభూతిలో షరతులు విధిస్తూ అంది వసుంధర.

"అయ్యగారూ! అమ్మగారికి వినేవోపిక లేదంట! పడుకొన్నారు. నన్నెళ్లమన్నారు! ఏమిటో చెప్పండి నేవింటాను"

"నీవే నాకు దిక్కైక శ్రోతవు! మా ఇరువురి మధ్యా దూతవు! వినుమరి!... పడుచు ప్రాయపు రొమ్ముపై పరవశించి, ముత్యాల హారమెందుకు నృత్యమాడు, ఎదను హారమ్ముగా చేసి యిచ్చినాను, పదిలముగ దాచుకొమ్ము నీ హృదయమందు" ఎలా వుందే!...

"పోండి అయ్యగారూ... మీరు మరీ కుర్రోళ్లయిపోతున్నారు. నా మెడలోవి పిచ్చిముత్యాలని ఎగతాళి చేస్తున్నారా?" సిగ్గుపడుతూ అంది సుబ్బులు.

"సిగ్గులేలను నీకు చిన్నారి! హేళనమ్ము కాదు వెక్కిరింపూ కాదు. మనసులోని మాట మాటాడుతుంటి. భావసుందరీ! నీవు నా ప్రక్క నుండ రంభనైనను నేను తిరస్కరింతు, నీవు వేసిన వలపు సంకెళ్లలోన ఖైదీనై జీవితమ్మును గడుపుకొందు".

"ఏంటే సుబ్బీ! ఆయనేదో భావసుందరీ అంటూ దీర్ఘాలు తీస్తున్నాడు. ఇంతకూ కూర్చొనున్నాడా? మీది మీదికి వస్తున్నాడా? నాకు లేచే ఓపిక లేదే! లేకపోతే ఆ పిచ్చికి తగ్గట్టుగా సమాధానం చెప్పేదాన్ని!"

"కుర్చీలో కూర్చొనే చదువుతున్నారమ్మా! నాకేసి కూడా చూడ్డంలేదు!"

"అట్టాగయితే సరేలే! పెద్దగా చదవమను నేనూ వింటా! నిదరట్టి చావడం లేదు!"

ఆ ఆసక్తికి రెచ్చిపోయాడు కవి. ఇక చూసుకో అన్నట్టుగా మొదలెట్టాడు "ఎక్కడ చప్పుడైన వనజేక్షణ! నీవటంచు చూతు. నీ చక్కని రూపు పొందుటకు చేరువ మార్గము తెల్పవే చెలీ!"

"ఓహో!...అట్టాగా! కుర్చీలోంచి లేచి తిన్నగా బెడ్‌రూంలోకి రమ్మనవే!" నవ్వుతూ వో చణుకు విసిరింది వసుంధర.

"పరిహాసమేల? మనసు వేసటచెందెను తాళలేనికన్, మక్కువ ప్రేమ భావమున మన్నిక రమ్మిక కౌగిలింపవే!"


"అమ్మో! ఇదేం పోయేకాలమే! కళ్లు మూసుకొని 'కృష్ణా రామా' అనుకునే రోజుల్లో ఈ కౌగిలింతలేమిటే? ఈయన కవిత్వం పాడుగాను! పాడుమాటలు!"

"అయ్యగారు మంచి ఆవేశంలో వున్నారమ్మా! మనం చెప్పేదేదైనా వినేట్టులేదు!"

"ఆయన ఆవేశం సరే! యింతకూ నీ వెట్టున్నావే! నీకు ఆవేశం రాలేదు కదా! వెధవ కామెంట్లూ నీవూనూ... యిక ఈ గదిలోకి తగలడు ఆయనే చదువుకొంటాడు".

"కఠిన హృదయమ్ముతో, నీవు కరుణలేక వదలిపోవగ తొందర పడెదవేల! అలసిపోయిన హృదయమ్మునాదుకొమ్ము!"

"ఇంతకుముందే కదే వీరభద్రుడు ఆరగించినట్లు ఆరగించింది. ఇంతలోనే ఏం చేసి



చీరాలలో ఇటీవల 'సహజ సాహితి' వారి సాహితీ మహోత్సవ్ సభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి డా॥ కొణిజేటి రోశయ్య గారి చేతులమీదుగా శ్రీమతి పోగుల వెంకటరత్తమ్మ స్మారక విశిష్ట సాహితీ పురస్కారాన్ని అందుకొంటున్న ప్రముఖ కథా రచయిత శ్రీ వడలి రాధాకృష్ణ, ప్రకాశం జిల్లా కలెక్టర్ శ్రీ కె. దేవానంద్, పురస్కార ప్రదాత కళాభారతి శ్రీమతి పోగుల విజయశ్రీ.

అంత అలసిపోయాడట! కాసేపు ఆ పడక కుర్చీలోనన్నా నడుంవాల్చుమను!"

"కరిగిపోయిన ప్రాయమ్ము తిరిగిరాదు. తీర్చుకోరాద మగువ! నీ తీపి కోర్కె!"

"అబ్బో!... కోర్కె తీర్చుతాడటనా? ఏమిటీ యన తీర్చే కోరిక? చీరెలు కొంటాడటనా? సారెలు పెడతాడటనా? చీనీ చీనాంబరాలు దిగేస్తాడటనా? ఏ కోర్కె తీరుస్తాడట! ఈ కవి గారు!"

"నీ తీపి కోర్కె తీర్చుకొనుము తీయని పాట పాడి".

"ఓహో!... అదా సంగతి? నేనే తీయని పాటపాడుకొని నా కోర్కె నేనే తీర్చుకోవాల టనా? బాధ్యత లేని మనిషి, బాదరబందీలేని సలహా! బోడి సలహాలంటే ఇవే మరి!"

"పిరికి గుండెల ప్రియుడని పిలుతువేల? అయ్యగారి మనసు అంతర్యమెరుగక! అమ్మ గారు!"

"పిచ్చి నీకూ బాగా తలకెక్కిందిగదే! నీవూ ఏదో వో 'కపి'వై పోయినట్టున్నావు!"

"ఇవి నా మాటలు కావులెండి! అయ్యగారు చదువుతున్న పుస్తకంలోని మాటలే! నాకంత తెలివా?"

"నన్ను మరచి, నా ప్రేమ మరచి, గుండె రాతిబండగ చేసుకొందువేల? చేరరమ్మ ముద్దు పెదవిపై నామోవి ముద్రవేతు!"

"కాస్తంత తెమలి కరెంటు బిల్లు కట్టి ముద్రే యించుకరమ్మను, ముద్దు పెదవిపై యింకా ఏమి ముద్ర వేస్తాడుగాని!"

"అమ్మగారంటుంది వింటున్నారుగా? కరెం టు బిల్లు కట్టిరండి! కరెంటు పీకేస్తే చీకట్లో చావలేమంటున్నారు అమ్మగారు!"

"అరుణ కాంతులు వెదజల్లు నీ హృదయ ముండ, కరెంటు దీప కాంతులకై ఏల వగ సెదవు బేలా!"

"నిండు ప్రేమ పంచెడి హృదయముండగా ఆకలి దప్పులేల? మీ అయ్యగార్ని అడగవే!" వ్యంగ్యంగా అంది వసుంధర.

"భేష్... భేష్!... కవిత్వము మీ అమ్మగా ర్లోనూ కట్టలు తెంచుకొంటోంది!"

"కట్టలూ తెగలేదు! కాళ్లూ తొక్కలేదు!" నీవోసారి ఇటు రావే సుబ్బూ!" ఏదో బోధ చేయడానికన్నట్టు పిలిచింది వసుంధర.

"అమ్మగారు పిలుస్తున్నారయ్యా! ఇప్పుడే వస్తా" బెడ్రూంలోకి జారుకుంది సుబ్బులు.

"ఎదురుచూచుట యమబాధ, ఎరుగవ మ్మా! పోయి త్వరగా రావమ్మ నీ యజమాను రాలుకడకు!"

"ఇటొచ్చి నీవు కొంచెంసేపు నడుం వాల్చ వే! స్పెషల్ తెలుగు గిలుగూ అంటూ... ఎప్పు డుపడితే అప్పుడు వేళగాని వేళల్లో ఆయన గదిలోకి వెళ్లకు. ముఖ్యంగా నేను ఇంట్లో లేనప్పుడు నీ పని నీవు చూచుకో! ఏకాంతంలో ఆడది కనిపిస్తే ఆవురావురంటూ చూసే మగాళ్లే ఎక్కువ. కనికరించేవాళ్లూ వుంటారు. కళా కారుల్ని అసలే నమ్మకూడదు. ముఖ్యంగా కవుల్ని. నీకేం తెలుసే పిచ్చిమొద్దా! చింత చచ్చినా పులుపు చావదని... శరీరం వాడినా, వయస్సు వడలినా మనస్సుకు పరువం తరుగ లేదంటారు, కావ్య పఠనమంటారు... కౌగిలిం చుకొంటారు! వచన కవిత్వం అంటారు... ఒళ్లంతా నిమురుతారు! వృద్ధులైనా ముద్దులు కావాలంటారు! జాగ్రత్త."

"అయ్యగారు అసుమంటోళ్లు కాదులేమ్మా! కవిత్వం చెప్తారేగానీ కన్నెత్తైనా చూడరు!"

"ఏ టైం ఎలా వుంటుందో ఎవరు చూసారే పిచ్చి మొహమా! 'బ్రహ్మకైన పుట్టు రిమ్మ తెగులు' అన్నారు పెద్దలు.

"మన జాగ్రత్తలో మనముండాలేకానీ చేతులు కాలాక ఆకులు పట్టుకొని లాభమేముంటుందో చెప్పు?" క్లాస్ మొదలెట్టింది వసుంధరమ్మ 'కవుల మీద, వారి మనస్తత్వాల మీదా'.

"ఇంతకూ నాకెందుకు చెబుతున్నట్టమ్మా ఇవన్నీ! నేనేమన్నా అసుమంటిదాన్ని అనుకుంటున్నారా? ఇప్పటిదాకా త్రాగుబోతు మొగుడితో వేగింది చాలకనా?"

"ఛ!ఛ!... నీవటువంటి దానివనుకుంటే యింట్లోకే రానిచ్చేదాన్నేకాదు! అవతలవాండ్లు కూడా నీవున్నట్లు వుండాలికదా! ఈమధ్య అమెరికాలో మన తెలుగు కవి మహాపండితుడనుకున్నాయన ఏమి చేసాడో వార్తల్లో వినలేదా?" ఉదాహరణ పూర్వకంగా వివరించడం మొదలెట్టింది వసుంధర.

"నిజమేనమ్మగారూ! ఆశ్రయమిచ్చి అన్నం పెట్టిన చేతినే కాటు వేయపూనిన ఆ కవిని టి.వి.లో చూసానమ్మా".

"అందుకేనే నేచెప్పేది... మన జాగ్రత్తలో మనముండాలని. కుర్ర పిల్లలు కవిత్వం పిచ్చితో కవిత్వం మెలుకువలు తెల్పుకునేందుకు ముసలి కవుల్ని ఆశ్రయిస్తుంటారు. వాళ్లకు అదేం పోయేకాలమో, ఒళ్లంతా తడమంది ఒక్క మాట చెప్పరు. కళ్లల్లోకి చూడంది కవిత్వమే నడవదు". మింగలేక వెళ్లగాయలేక ఎవరికీ చెప్పుకోలేక కుమిలిపోయే కవయిత్రులు ఎంతో మంది ఈ దేశంలో. ఈమధ్య యింకా వాళ్ల చేతిలో వున్న అవార్డులు కూడా మాటవిన్న కవయిత్రులకే యిస్తున్నట్లు వార్తలు వింటున్నాము. కొంతమంది కవయిత్రులకు 'గోష్టు రైటర్స్'గా మారిన పెద్ద కవులూ లేకపోలేదు. 'అదే రిమ్మ తెగులంటే'.

"ఏమోలేమ్మా! ఇవన్నీ వింటూంటే నాకేందో భయంగా వుంది. నేనసలే కాపురం చెడిన దాన్ని. నా జాగ్రత్తలో నేనుంటేనే మంచిది. మంచిమాటే చెప్పారు అమ్మగారు".

"సరే! ఈ మాటలకేమి వచ్చెగానీ కాసేపు కన్నుమూయవే! ఆరోగ్యంగా వుంటుంది. ఇట్టా గన్నానని అయ్యగారి 'రూమ్'లోకి వెళ్లకుండా వుండేవు... ఆయన కవిత్వం వినేందుకు మాత్రం ఎవరున్నారు పాపం?"

"నిద్రొస్తుందమ్మా" అలసిపోయినట్టు కళ్లు మూసుకుంది సుబ్బులు.


* * *

"ప్రేయసీయని ప్రేమతో పిలిచినాను పలుకు బంగారమాయెనా పలుకవేల? రెండు గుండెలు ముడివేయ పండుగగును. ప్రణయ జీవులు విడిపోయి బ్రతకగలరే!" రావే సుబ్బూ! నీకు తప్పేట్టులేదు! నీదు చల్లని నవ్వు చిందినంత మాయమైపోవు నామనస్సులోని బాధ".

"దగ్గరకొస్తున్న అయ్యగార్ని చూస్తే సుబ్బులు మనస్సులో ఏదో భయం, శరీరమంతా వణుకు, బెదురుచూపులూ మొదలయ్యాయి". చుట్టూ చూస్తే ఎవరూ లేరు. అమ్మగారు యింట్లో లేదు. వణికిపోతోంది సుబ్బులు ఆయన అడుగుల సవ్వడి దగ్గరయ్యే కొద్దీ".

"సిగ్గు తెరలను తొలగించి చేరరమ్ము, నవ్వులు చిలకరించి నన్నత్తుకొమ్ము, పుణ్య కాలము వ్యర్థమైపోకమున్నె ముంచివేయుద స్వర్గ సుఖమ్ముల నిన్ను!"

"అమ్మో! అమ్మగారన్నది నిజమేలాగుంది!




ఏంటీ ఈ రోజు అయ్యగారి ధోరణే పూర్తిగా మారిపోయింది? అయ్యగారు అనుకున్నంత మంచివారులా లేరు. లేకపోతే యిలా చేతులు చాచి మీదమీదకు రావడమేమిటి?" పులిని చూసిన లేడిపిల్లలా గజగజ వణుకుతోంది సుబ్బులు.

"లాలించరమ్మా హాయిగుందము... ప్రణయ బంధమ్మునందు" ఒక్కసారి తన కౌగిలింతలోకి లాక్కుంటున్నట్టుగా వుంది. "గుండె లోపల మం డెడి కామాగ్నినార్ప అమృతవర్షం కురిపించి నన్నాదుకొమ్మా" ఏమంటావ్ సుబ్బూ!... కళ్ల తోనే పలకరిస్తూ మరీ దగ్గరౌతున్నారు అయ్య గారు.

"అయ్యగారూ! అయ్యగారూ! నేనటువంటి దాన్ని కాదండీ! అబ్బా! అమ్మగారూ! నన్ను రక్షించండి! అయ్యగారు ఏందేందో చేసేస్తున్నా రండీ! రండి! రండి! రక్షించండి" పెద్దగా వెర్రికేకలేస్తోంది సుబ్బులు.

"ఏంటే నీ దుంపతెగ. గొంతు కోసిన మేక లా అరుస్తున్నావు? అప్పుడే నిద్రోయి చచ్చి కల గన్నావా? అలా వొంపులు తిరిగి తన్నుకుం టున్నావేంటి? లెగు... లెగు..." అంటూ తట్టి లేపింది వసుంధర.

సుబ్బులు కంగారుగా నిద్రలేచింది! అయ్య బాబోయ్! ఇది కలా! నిజం కాదుగదా! ఒళ్ళం తా తడుముకుంటూ బట్టలు సర్దుకుంటూ నిలబ డింది సుబ్బులు... సిగ్గులు చిలకరించి వాలు కళ్లతో నేలన ముగ్గులు వేస్తూ.

"సీన్' అర్థమైంది వసుంధరకు. ఎత్తుగడ బాగా పారిందనుకుంటూ తనలో తాను ముసి ముసి నవ్వులు నవ్వుకుంది. 'ఇక చస్తే పని ఎగ్గొట్టి ఆయన గదిలోకి పోదిది. లేకపోతే దీనికి కవిత్వం కావాలా? కవిత్వం!

భర్త గదిలోకి వోసారి తొంగిచూసింది వసుంధర. భావకవిత్వం 'రాగవిపంచి' చదు వుతూ రాగాలు తీస్తూనే ఉన్నారు కవిగారు ఈ ప్రపంచమే పట్టనట్లు. ●